# సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య
- అధికారులతో సమీక్ష



వైద్యాధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ చౌరస్తా, డిసెంబర్ 15 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీలను మరింత ప్రోత్సహించాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సర్కారు దవాఖానల్లో ప్రజలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, నార్మల్ డెలివరీలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ శివలింగయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్), జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, బచ్చన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పక్కాగా నార్మల్ డెలివరీల సంఖ్యను పెంచడానికి వైద్యాధికారులు, సిబ్బంది ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. జిల్లా మెడికల్ కళాశాలలో షెడ్యూల్ ప్రకారం వైద్య విద్యార్థులకు తరగతులు నిర్వహించాలన్నారు. కళాశాలలో కావాల్సిన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేసినందున వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ చేపూరి ప్రశాంత్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలరావు, కమ్యూనిటీ ఏరియా హాస్పిటల్ డాక్టర్ పీ సుగుణాకర్‌రాజు, డాక్టర్ అనురాధ, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ రవీందర్, డాక్టర్ అశోక్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ సుధీర్, డాక్టర్ మల్లికార్జున్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కరుణాకర్‌రాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కడియం శ్రీహరికి శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీధర్‌రావు

## ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసిన శ్రీధర్‌రావు

చిల్పూరు, డిసెంబర్ 15 : స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కడియంను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందజేయాలని ఈ సందర్భంగా కడియంను కోరినట్లు శ్రీధర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఎడవెల్లి దయాకర్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సుల్లో లక్షా81వేల మంది మహిళల ఉచిత ప్రయాణం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకంలో భాగంగా జనగామ జిల్లాలో ఇప్పటి వరకు లక్షా81వేల309 మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం సాగించినట్లు కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జనగామ ఆర్టీసీ డీఎం వీ జ్యోత్స్నకు మహాలక్ష్మి పథకంలో భాగంగా జీరో టికెట్‌ను కలెక్టర్ శివలింగయ్య అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో అప్ అండ్ డౌన్ చేసే గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు, రోజువారీ మహిళా కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. శుక్రవారం నుంచి బస్సుల్లో ప్రయాణించే మహిళలు, విద్యార్థినిలు, థర్డ్ జెండర్స్‌కు 'జీరో టికెట్'ను జారీ చేస్తున్నట్లు కలెక్టర్ శివలింగయ్య తెలిపారు. బస్సులో ప్రయాణించే మహిళలు తమ ఆధార్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు లేదా ఇతర ధ్రువీకరణ పత్రాలను కండక్టర్లకు చూపించి జీరో టికెట్‌ను తీసుకోవాలని సూచించారు. మహిళా ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్సులో ఉచితంగా ప్రయాణించడానికి ఆర్టీసీ సిబ్బంది సహకరించాలని కలెక్టర్ ఆదేశించారు.



జీరో టికెట్‌ను డీఎం జ్యోత్స్నకు అందిస్తున్న కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రవీందర్, ఎంపీటీసీ

## బీటీ రోడ్డు పనులు ప్రారంభం

చిల్పూరు, డిసెంబర్ 15 : మండలంలోని లింగంపల్లి గ్రామ పరిధిలోని దేవోజీతండాకు రూ.కోటి ఎమ్మెల్సీ నిధులు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో శుక్రవారం సర్పంచ్ ఏదునూరి రవీందర్, ఎంపీటీసీ కనుకుంటి రవీందర్ బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో చిల్పూరు ఆలయ మాజీ చైర్మన్ జీ సంపత్‌రెడ్డి, కే రాజన్న, ఎల్ వేణు, గ్రామశాఖ అధ్యక్షుడు రచ్చ రవీందర్, కే సత్తయ్య, ఎస్ రవీందర్, ఎల్ బాగున నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇల్లందుల సుదర్శన్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ జనగామ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి

## అటెండర్‌కు ఆర్థిక సాయం

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 15 : మండలంలోని తాటికొండ ప్రైమరీ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన అటెండర్‌గా పని చేస్తున్న అనంతపురం శంకర్‌కు వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి శుక్రవారం రూ.వెయ్యి ఆర్థిక సాయం అందించారు. తనకు వచ్చే వేతనం సరిపోక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని గతంలో శంకర్ సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో స్పందించి ప్రతి నెలా వేయి రూపాయలు ఆర్థిక సాయం అందించి ఆదుకుంటున్నట్లు సుధీర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మారపాక శ్రీధర్, బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు బలిజ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏటీఎంలలో సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలి

ఏసీపీ శ్రీనివాస్‌రావు



బ్యాంకు మేనేజర్లకు సూచనలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 15 : ఏటీఎం సెంటర్లు, బ్యాంకులలో సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ శ్రీనివాస్‌రావు బ్యాంకు మేనేజర్లకు సూచించారు. శుక్రవారం ఏసీపీ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకుకు, ఏటీఎం సెంటర్లకు వచ్చే ఖాతాదారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోపిడీలు, నగదు అపహరణ జరుగకుండా సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు జల్సాలకు అలవాటు పడి, తొందరగా ఆర్థికంగా ఎదగాలని కష్టపడే తత్వాన్ని కోల్పోయి సైబర్, ఇతర క్రైంలకు పాల్పడుతున్నారని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు వారి బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని బ్యాంకు మేనేజర్లకు ఏసీపీ సూచించారు. సమావేశంలో రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు నాగరాజు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కడుపునొప్పి భరించలేక కౌలు రైతు ఆత్మహత్య

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 15 : కడుపునొప్పి భరించలేక కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని తాటికొండ శివారు టీబీ తండాలో చోటుచేసుకున్నట్లు ఏఎస్సై బోడకుంట్ల రాజమౌళి తెలిపారు. టీబీ తండాకు చెందిన భూక్యా నరేశ్‌కు ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమారులు. మీదికొండ గ్రామానికి చెందిన మధనాచారికి చెందిన మూడు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలు కు తీసుకుని సాగు చేస్తున్నాడు. మూడేళ్ల క్రితం నరేశ్‌కు అపెండెక్స్ రావడంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. ఈ క్రమంలో గురువారం వ్యవసాయ బావి వద్ద పెద్ద భార్య అనితతో కలిసి వ్యవసాయ పనుల్లో ఉండగా కడుపునొప్పి రావడంతో దవాఖానకు వెళ్తామన్నాడు. తరుచూ కడుపునొప్పి వస్తున్నా ఏమీ కాలేదని, ఇప్పుడు దవాఖానకు వద్దని అనిత తెలిపింది. దీంతో ఆగ్రహించిన నరేశ్ అనితను కొట్టి పత్తి చేనులోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించగా మృతి చెందాడని ఆయన తెలిపారు. అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజమౌళి తెలిపారు.




ఆర్థిక సాయం అందిస్తున్న శివకుమార్‌గౌడ్

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బచ్చన్నపేట, డిసెంబర్ 15 : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన మినుకూరి బాల్‌రెడ్డికి చెందిన పాడి ఆవు మృతి చెందింది. రూ.లక్ష అప్పు తెచ్చి పాడి ఆవును కొనుగోలు చేశానని, ఆవు మృతి చెందడంతో అప్పు తీర్చడం ఎలా అని బాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న శివకుమార్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలంటూ రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాల్ల సిద్ధిరాములు, ఉమ్మెంతుల మల్లారెడ్డి, పసుల రాములు, కొప్పరపు రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

బచ్చన్నపేట, డిసెంబర్ 15 : మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మండల కేంద్రం నుంచి కొన్నెకు వెళ్లే దారిలోని పెద్దమ్మ ఆలయం సమీపంలో రాకేశ్, రవి అనే ఇద్దరు పొలం దున్ని కేజీవీల్స్ విప్పుతున్నారు. ఈ క్రమంలో నక్కవానిగూడెంకు చెందిన బొట్టు నరేశ్ అతని ద్విచక్ర వాహనంపై మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదుపు తప్పి కేజీవీల్స్ విప్పుతున్న రాకేశ్, రవిలను ఢీకొట్టాడు. వాళ్లిద్దరితోపాటు నరేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని జనగామ ఏరియా దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

## దేవరుప్పులలో ఉచిత కంటి వైద్య శిబిరం

దేవరుప్పుల, డిసెంబర్ 15 : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు ఈదునూరి నర్సింహారెడ్డి ప్రారంభించారు. హనుమకొండలోని శరత్ మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి దవాఖాన వైద్యులు గ్రామస్తులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమైన వారిని దవాఖానకు తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు వారు తెలిపారు. కంటి దోషాలు ఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా మందులు, అవసరమైన వారికి అద్దాలు అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కోశాధికారి గోలి పెద ఉప్పల్‌రెడ్డి, సభ్యులు కారుపోతుల సందీప్, మొగుళ్ల గోపయ్య ఉన్నారు.

## అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

పాఠశాల విద్యాశాఖ
రాష్ట్ర కార్యదర్శి వాకాటి కరుణ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివలింగయ్య, డీఈవో రాము

జనగామ చౌరస్తా, డిసెంబర్ 15 : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్యతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు తొలిమెట్టు, ఆరు నుంచి తొమ్మిదో తరగతి వారికి ఉన్నతి, పదో తరగతి వారికి లక్ష్య అనే కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రతీ సబ్జెక్టులో ప్రతిభకనబర్చేలా శిక్షణ ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి వచ్చే జనవరి 10వ తేదీ వరకు 'అకాడమిక్ బబుల్' అనే కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు కరుణ తెలిపారు. దీని ద్వారా విద్యార్థులు ధారాళంగా చదవడం, రాయడం, విషయాల వారీగా పూర్వ భావనల జ్ఞానాన్ని పెంపొందించి అభ్యసన ఫలితాలు సాధించడానికి జిల్లా విద్యాశాఖ అధికారులు శ్రద్ధచూపాలని ఆదేశించారు. విద్యాశాఖ రూపొందించిన యాప్ ద్వారా పాఠశాలల్లో రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు వివరించారు. దీనిపై శాఖాపరంగా పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సు హాసిని, డీఈవో రాము, ఏఎంవో శ్రీనివాస్ పాల్గొన్నారు.